



అడవి పూసిన అందాలు

వానలు కురుస్తున్నాయి. చినుకు తడి తగిలిన చెట్టూచేమా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. నేల రాలిన ఎండుటాకులు మట్టిలో మగ్గిన కమ్మటి వాసన అడవంతా పరచుకుంటోంది. ప్రకృతి కొత్త జీవులకు పురుడుపోస్తోంది. వాన వెలిసి ఎండపొడ పడినతావుల్లోంచి వెచ్చని ఆవిరి పొగలా పైకి లేస్తోంది. అడవిపూలను వెతుక్కుంటూ రంగురంగుల సీతాకోకచిలుకలు తిరుగుతున్నాయి. నేల పిగిలినట్లుగా, చెట్లు పూసినట్లుగా ఎటు చూసినా సీతాకోకచిలుకల గుంపులు తిరుమల అడవుల్లో కనువిందు చేస్తున్నాయి. శేషాచలం కొండల్లో దాదాపుగా 106 జాతుల సీతాకోకచిలుకలు ఉన్నట్టు ఒక అంచనా. అయితే కేవలం 5 కుటుంబాలకు చెందిన 50 జాతులనే ఇప్పటిదాకా వివిధ అధ్యయనాల్లో గుర్తించారు. తిరుమలతో పాటూ తలకోన, మామండూరు, బాలపల్లి, దివ్యారామం ప్రాంతాల్లో సీతాకోకచిలుకలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నల్లటి రెక్కలమీద ఎర్రటి మచ్చలుండే కామన్‌రోజ్, నలుపుతో పోటీపడే గాఢ నీలిరంగు మచ్చల బ్లూటైగర్, లేత, గాఢ పసుపు రంగు పూసినట్లుగా ఉండే లెమన్ ఎమిగ్రెంట్ రకాలు తిరుమల అడవుల్లో అత్యధికంగా కనిపిస్తున్నాయి. నిజానికి వీటి జీవితకాలం రెండు నెలలలోపే అయినా ప్రకృతి ధర్మాన్ని నెరవేర్చడానికి సంబరంగా సందడిగా ఎగురుతూ వాలుతూ అడవంతా అందాలు పంచుతున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి



చెవిరెడ్డి చుట్టూ తుడా ఉచ్చు

4300 పేజీల నివేదిక అందజేసిన విజిలెన్స్

పక్కాగా ఫొటోలు, ఆధారాలు

ప్రభుత్వ ఆదేశాలతో కేసు నమోదుకు అవకాశం

తిరుపతి(నేరవిభాగం), జూలై 20(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న తుడా మాజీ ఛైర్మన్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చుట్టూ తుడా ఉచ్చు బిగుసుకుంటోంది. తుడాలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు అధికారులు ప్రభుత్వానికి దాదాపు 4300 పేజీల నివేదికను పంపారు. దీంతో ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిన పరిస్థితి చెవిరెడ్డికీ, అప్పటి తుడా అధికారులకూ ఎదురైంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు రూ.380 కోట్ల పైచిలుకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా ఖర్చు చేసినట్లు విజిలెన్సు నివేదికలో పొందుపరిచారు. ఇందులో ఎక్కువ శాతం నిధులు సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. చివరకు తెలంగాణ ఎన్నికల సమయంలోనూ పొలిటికల్ సర్వే కోసం తుడా డబ్బును వాడినట్లుగా అధికారులు గుర్తించారు. తుడా నిధులు దాదాపు 90 శాతం వరకు చంద్రగిరి నియోజకవర్గంలోని పనులకు మళ్లించారు. ఇలా చేయడం నేరమని అధికారులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఇక చెవిరెడ్డి సొంత ఊరైన తుమ్మలగుంట ట్యాంక్ ఆధునికీకరణ పేరుతో కోట్లు దుర్వినియోగం అయిందనీ, ప్రజాధనంతో బెంచీలు ఏర్పాటు చేసి వాటిపై వారి పేర్లు రాసుకున్నారనీ, తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడు వ్యక్తిగత పర్యటనలకు కూడా తుడా డబ్బులే ఖర్చు చేశారనీ అధికారుల నివేదికలో పొందుపరిచారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలకు అనధికారికంగా పనులు, బడ్జెట్ కేటాయించినట్లు చూపించారు. ఆ నిధులను వ్యక్తిగత ఖాతాలో జమచేశారు. అలాగే చెవిరెడ్డి కుటుంబానికి చెందిన సీఎంఆర్ కంపెనీనే చాలా కాంట్రాక్టు పనులు చేపట్టింది. మొత్తంగా చెవిరెడ్డి కుటుంబం తుడా నుంచి భారీగానే నిధులు దుర్వినియోగం చేసినట్లు విజిలెన్సు తేల్చింది. అయితే ఛైర్మన్‌కు సంతకం చేసే అధికారం లేదని, తనకేం తెలియదని చెవిరెడ్డి మీడియా సమావేశంలో చెప్పారు. దీనిద్వారా తన మాటవిని సంతకాలు పెట్టిన అధికారుల మెడకు కూడా ఉచ్చు బిగుసుకునేలా చేశారాయన. తుడా నిధుల దుర్వినియోగంపై విజిలెన్సు విచారణలో గుర్తించిన అంశాలను బట్టీ ఆయన తప్పించుకోలేరని అధికారుల వాదన. దీంతో లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి జైలులో ఉన్న చెవిరెడ్డి మెడకు తుడా నిధుల దుర్వినియోగం కేసు కూడా చుట్టుకున్నట్టే అంటున్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద నడి రోడ్డుపై లారీ నుంచి పడిన బండరాయి - పరదాల మాటున బండరాళ్లను తరలిస్తున్న లారీ

పరదాల మాటున బండరాళ్ల తరలింపు

● లారీ నుంచి ఒకటి కింద పడటంతో గుట్టు రట్టు

కేవీబీపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా, పరదాల మాటున బండరాళ్లు తరలిపోతున్నాయి. కేవీబీపురం మండలం మఠం సమీపంలోని ఓ మైనింగ్ కంపెనీకి సంబంధించిన టిప్పర్ ఆదివారం ఉదయం 40 టన్నుల బరువైన బండరాళ్లను లోడ్ చేసుకుని పరదా కప్పి చెన్నైకి బయలుదేరింది. కేవీబీపురం పోలీస్‌స్టేషన్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద వాహనం వెనుక తలుపు తెరచుకుని పెద్దబండరాయి నడిరోడ్డుపై పడింది. డ్రైవర్ గుర్తించకుండా వెళ్తుండగా స్థానికులు టిప్పర్‌ను ఆపారు. వాళ్లు ఆపకుంటే మరో బండరాయి రోడ్డు మీద పడేది. దీన్ని గమనించిన కానిస్టేబుల్ టిప్పర్‌ను రోడ్డు పక్కన ఆపించారు. ఇటీవల బ్రాహ్మణపల్లె పరిసర గ్రామాల ప్రజల ఫిర్యాదు మేరకు క్రషర్ కంపెనీని సీజ్ చేశారు. అయితే యాజమాన్యం ఇక్కడ క్రషింగ్‌ను నిలిపి రాత్రిళ్లు డిటొనేటర్లు పేల్చి పెద్ద బండరాళ్లను టర్బోజెట్ లారీల్లో చెన్నైకి తరలిస్తోంది. ఆదివారం టిప్పర్‌లో నుంచి బండరాయి కిందపడటంతో అసలు గుట్టు రట్టయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీజ్ చేసిన కంపెనీ నుంచి బండరాళ్లు ఎలా బయటకు తరలిస్తున్నారనే విషయంపై విచారణ జరిపించాల్సి ఉంది.



పడేందుకు సిద్ధంగా ఉన్న మరో బండరాయి

టేకాఫ్ కాగానే సాంకేతిక సమస్య

● అరగంటపాటు గాల్లో చక్కర్లు

● చివరకు రద్దయిన ఇండిగో విమాన సర్వీసు

రేణిగుంట, జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో ఆదివారం రాత్రి టేకాఫ్ అయిన కొంతసేపటికే ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. కాసేపు గాల్లో చక్కర్లు కొట్టి.. ఆ తర్వాత ల్యాండింగ్ చేసి సర్వీసును రద్దు చేశారు. ప్రయాణికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాదు నుంచి ఆదివారం రాత్రి 7.10 గంటల సమయంలో తిరుపతికి వచ్చిన ఇండిగో విమానం.. ఇక్కడ నుంచి 7.30 గంటలకు 200 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయింది. కొంతసేపటికి సాంకేతిక సమస్య తలెత్తడంతో, అరగంట పాటు గాల్లో చక్కర్లు కొట్టి తిరిగి 8 గంటలకు రన్‌వేపై ల్యాండైంది. విమానంలో ఉన్న ప్రయాణికులను వెయిటింగ్ ప్రాంతానికి పంపించి 8.30 గంటలకు ప్రయాణికులకు బోర్డింగ్ పాసులు అందించారు. ఆ తర్వాత విమానంలోకి ప్రయాణికులను పంపారు. కొంతసేపటికి విమానంలో తిరిగి సాంకేతిక సమస్య తలెత్తిందంటూ ప్రయాణికులను వెనక్కి పంపేశారు. సాంకేతిక కారణాలతో విమాన సర్వీసును రద్దు చేస్తున్నట్లు రాత్రి 9 గంటలకు అధికారులు ప్రకటించారు. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. టిక్కెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు రీఫండ్ చేస్తామని యాజమాన్యం తెలపడంతో వెనుదిరిగారు.



ప్రత్యేక అలంకారంలో శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామి

హరోం.. హర

● విజ్ఞానగిరికి పోటెత్తిన భక్తులు





శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): హరోం హర అంటూ భక్తులు శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా విజ్ఞానగిరికి పోటెత్తారు. ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా కుమారస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. పసుపు దుస్తులు ధరించి సుమారు 2,700మంది కావళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నారద పుష్కరిణి వద్ద రాత్రి 8.30గంటల వరకు 8,500 మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఉదయం వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఇంద్రవిమానంపై పురవిహారం చేశారు.



సృజనాత్మకతతో ముందుకు సాగండి

● కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టండి

● తిరుపతి ఐఐటీ స్నాతకోత్సవంలో క్రియా వర్సిటీ చాన్సలర్ సూచన



సజ్జన్ జిందాల్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ గవర్నర్స్ అవార్డు అందుకుంటున్న మేఘ వర్షిణి



డిగ్రీలు అందుకున్న ఐఐటీ విద్యార్థులు

ఏర్పేడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టుదల, సృజనాత్మకతతో ముందుకు సాగాలంటూ విద్యార్థులకు క్రియా యూనివర్సిటీ చాన్సలర్ లక్ష్మీనారాయణన్ సూచించారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆదివారం జరిగిన 7వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎల్‌ఈజీవో వ్యవస్థాపకుడు ఓలే కిర్క్ క్రిస్టియన్సన్ జీవితాన్ని ఉదహరించిన ఆయన.. కష్టాలను ఎదుర్కొంటూ ఎలా గొప్ప విజయాలను సాధించవచ్చో వివరించారు. అదే తరహాలో కృషి పట్టుదలతో కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. స్పేస్ టెక్నాలజీ, స్టార్టప్ పికెల్స్ గురించి వివరించారు. హైపర్ స్పెక్ట్రాల్, ఇమేజింగ్ అనే సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం, మైనింగ్, పర్యావరణం వంటి రంగాల్లో డేటా ఇవ్వడానికి ఉపగ్రహాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా డ్రోన్ ఆధారిత పరిష్కారాలపై పరిశోధనలు జరుగుతుండటాన్ని గుర్తించాలన్నారు. చుట్టూ ఉన్న ప్రపంచం వేగంగా మారిపోతోందని, ప్రతి రంగంలో కనిపిస్తున్న కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. 'మీ కథలను మీరే రాయండి. వాటిలో మీరే హీరోలుగా ఉండండి' అంటూ సలహా ఇచ్చారు.

పట్టుదలతోనే వికసిత్ భారత్

వికసిత్ భారత్ లక్ష్యం సాధించాలంటే విద్యార్థులకు కృషి, పట్టుదల అవసరమని బోర్డు ఆఫ్ గవర్నర్ ఛైర్మన్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఎండీ సజ్జన్ జిందాల్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ, సైన్స్ రంగంలో భారత ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలపై దృష్టిపెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న క్వాంటం వ్యాలీ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతాన్ని టెక్నాలజీ స్ట్రాటజిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాయని తెలిపారు. తిరుపతి ఐఐటీకి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తుందని డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. కొన్నేళ్లుగా అధ్యాపకులు నిర్వహించిన విద్యా కార్యకలాపాలు, పరిశోధనలను వివరించారు. ఈ ఏడాదిలో కోర్సులు పూర్తి చేసుకున్న 417మంది విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు.

18 మందికి అవార్డులు

ప్రత్యేక ప్రతిభ కనబరచిన 18మంది విద్యార్థులకు వివిధ రకాల అవార్డులను ముఖ్య అతిథులు లక్ష్మీనారాయణన్, సజ్జన్ జిందాల్, ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ప్రదానం చేశారు. అరవింద్ శ్రీనివాసన్‌కు ప్రెసిడెంట్ అవార్డు, మేఘవర్షిణికి గవర్నర్స్ ప్రైజ్, షేక్ మహ్మద్ అల్లాబక్ష్‌కు మొదటి డీన్స్ ప్రైజ్, పి.కుమార్‌మిశ్రాకు ఇన్‌స్టిట్యూట్ ప్రైజ్, మేఘవర్షిణికి కమటం కృష్ణయ్య అవార్డు, కొత్తపల్లి ఈశ్వర్ వెంకట సాయివర్మకు అసోసియేట్ ప్రైజ్, అరవింద్ శ్రీనివాసన్, కలం మదన్‌మోహన్, జైదీప్ రాయ, రితిక్‌మండల్, ఆదిత్యన్, గౌరవ్ త్రిపతికు ఇనిస్టిట్యూట్ ప్రైజ్, సుధాకర్ వెంకటాచలానికి అమరరాజా ప్రైజ్, శ్రుతికి ఐటీసీ లిమిటెడ్ ప్రైజ్, ఆకాశకు ప్రొఫెసర్ శ్రీనివాసన్ నటరాజన్ అవార్డు, అన్నయ్ మండల్‌కు ఆకురత్తి కుమారస్వామి సీతారావమ్మ మెమోరియల్ ప్రైజ్, చిరంజీవికి రామకృష్ణన్ ప్రైజ్ లభించాయి.

ప్రెసిడెంట్ అవార్డు రావడం ఆనందంగా ఉంది

417మందిలో నాకు ప్రెసిడెంట్ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మా తల్లిదండ్రుల కలలు నిజం చేసిన రోజు వచ్చిందని ఆనందంగా ఉంది.

- అరవింద్ శ్రీనివాసన్

పట్టుదల కృషితోనే సాధ్యం

పట్టుదల, కృషి, అధ్యాపకుల సహకారంతో గవర్నర్ ప్రైజ్ అందుకున్నా. దీంతో కృషితో దేన్నయినా సాధించవచ్చని నిరూపణ అయింది. వందమందిలో ప్రత్యేకంగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది.

- ఎం.మేఘవర్షిణి

సుబ్రహ్మణ్యస్వామికి పుష్పకావిళ్ల సమర్పణ



సుబ్రహ్మణ్యస్వామికి కావిళ్లు సమర్పించుకుంటున్న భక్తులు

పాకాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యం కొండ)పై వెలసిన వళ్లీదేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, పూజ నిర్వహించారు. పరిసర గ్రామాల నుండి పుష్పకావిళ్లతో కాలినడకన భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కావిళ్లు సమర్పించుకొని తలనీలాలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. హరోంహర నామస్మరణతో ఆనందగిరి మారుమోగింది. ఈ సందర్భంగా ఈవో ఎస్ యువరాణి, ప్రధాన అర్చకుడు మాట్లాడుతూ ఈ యేడాది ఆడిమాసంలో ఆగస్టు 16న రెండవ కృత్తికలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

వైభవంగా ఆడికృత్తిక ఉత్సవాలు



భాకరాపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు గ్రామం అరుణగిరి(అనుమలబండ)పై శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేసి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం కల్యాణం నిర్వహించారు. అనంతరం కావిళ్లు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ధర్మకర్త గుమ్మడి కృష్ణమూర్తి అన్నదానం ఏర్పాటు చేశారు.

250 మందికి కంటి పరీక్షలు



పాకాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మొగరాలలో ప్రగతి గ్రామీణ అభివృద్ధి ట్రస్ట్ (కృష్ణాపురం) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి (తిరుపతి), డీబీసీఎస్ సహకారంతో 250 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. 55 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. ఉచిత ప్రయాణ భోజన సౌకర్యాలు కల్పించి వీరిని తిరుపతి అరవింద్ ఆసుపత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించాక స్వగ్రామాలకు తీసుకెళ్తామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ నాగరాజ నాయుడు, ఉపాధ్యక్షుడు చక్రవర్తి నాయుడు, కార్యదర్శి జయచంద్ర, సహాయ కార్యదర్శి మునస్వామి నాయుడు, కోశాధికారి శివమణి, అరవింద్ ఆసుపత్రి వైద్యులు నీలిమ, ప్రత్యూష, క్యాంప్ ఇన్‌చార్జ్ జీవన్‌రావ్, వాలంటీర్ శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయుడు వెంకటసిద్దులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న భరత్‌కుమార్, సిద్ధారెడ్డి తదితరులు

తిరుపతి రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తుమ్మలగుంట టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎస్సీకాలనీలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవతో చేపట్టిన కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. బూత్‌యూనిట్ ఇన్‌చార్జి బిరుదాల సిద్దారెడ్డి, జి.చెంగల్రామానాయుడు, రాధారాయల్, గురవారెడ్డి, శివ, మణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ ఉత్సవాలు



మాతమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న జయచంద్రారెడ్డి

చంద్రగిరి, జూలై 20(ఆంధ్రజ్యోతి): అగరాల హరిజనవాడలో రేణుక మాతమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జేసీఆర్(జయచంద్రారెడ్డి) ఆదివారం పట్టు వస్త్రాలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట చంద్రబాబు, పినపెద్ద మునెయ్య, క్రిష్ణయ్య, వెంకటముని, మురళి, తదితరులు పాల్గొన్నారు.

భక్త జన సంద్రం... ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్త జన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులతో పాటూ ఆడికృత్తిక తోడవడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధి కారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శ నం 739 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కె ట్ల ద్వారా 4,602, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,663 మంది భక్తులు దర్శించు కున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,899మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,215, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 361మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 305మంది, రూ.5 వేలు టిక్కెట్ల ద్వారా 119మంది భక్తులు పూజ లు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసా దాలు కలిపి 32,739 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

చంద్రగిరి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- శుక్రవారం హుండీ ఆదాయం: రూ.4.23 కోట్లు
- శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,011
- తలనీలాలు సమర్పించినవారు: 33,328

శ్రీవారిసేవలో భూమా అఖిలప్రియ



మాజీ మంత్రి, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హరి

తిరుచానూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని ఆదివారం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హరి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతంపలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగాధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

సమ్మోహనంగా సాగిన నృత్యం



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో ఆదివారం వారాంతపు సెలవును పురస్కరించుకుని కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. రేణిగుంటకు చెందిన పెద్దబాబయ్య బృందం వేదశ్రీ, కేథరిన్, హేమాస్విని, ధనలక్ష్మి, ధనశ్రీ, హరి, నితిన్, దుర్గ తదితరులు మూషిక వామన, వేదములే శ్రీనివాసం, ముద్దుగారే యశోద, నగుమోము గణలేని, భో శంభో వంటి కీర్తనలకు చక్కగా నర్తించారు.శిల్పారామం అధికారులు కళాకారులను సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

తెలుగు టీచర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతిరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): జూపార్క్‌రోడ్డు క్యాన్సర్ ఆసుపత్రి వద్ద గల ఉదయమాణిక్యం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గెస్ట్ తెలుగు టీచర్ పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ కె.రేష్మ పేర్కొన్నారు. ఎంఏ(తెలుగు), బి.ఎడ్ విద్యార్హత ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు ఈ నెల23వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9000783185 ఫోన్‌నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న పాండవ వనవాసం

రామచంద్రాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి) రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భాగవతారిణి అనసూయ ప్రదర్శించిన పాండవ వనవాసం హరికథ భక్తులకు ఆకట్టుకుంది. కౌరవులు పాండవులను రప్పించి మాయాజూదంలో ఓడించడం, 13 ఏళ్ల అరణ్యవాసం, ఏడాది అజ్ఞాత వాసంతో పాటు అర్జునుడు పాశుపతాస్త్రాన్ని శివుని పూజించి తీసుకునే ఘట్టాలను రమ్యంగా వినిపించారు. అంతకు ముందు ద్రౌపదీ సమేత ధర్మ రాజ స్వామి మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం

రామచంద్రాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన చేకూరి జనార్దన్ చౌదరిని పీపీపురం మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా రైతులకు విరివిగా పంట రుణాలు మంజూరు చేసి రైతుల వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నరసింహారెడ్డి, రాజేష్, కుప్పా త్యాగరాజులు, దిలీప్ రాయల్, మల్లిరెడ్డి, భూపతిరెడ్డి, ప్రతాప్‌రాయల్, నాగూర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్న పుష్పపల్లకీలో కనకదుర్గమ్మ దర్శనం



విశేషాలంకరణలో కనకదుర్గమ్మ

చంద్రగిరి, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో వార్షిక ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు చిన్న పుష్పపలకీలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో మూల విరాట్‌కు వివిధ రకాల అభిషేకాలనంతరం విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తిని పుష్పపల్లకిలో అదిష్టించారు. ఉత్సవాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సింగు వంశస్తులు, శ్రీనివామంగాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలసుబ్రహ్మణ్యస్వామికి తిరుమంజనం

రామచంద్రాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా భవానీ జలకంఠేశ్వరస్వామి ఉపాలయంలో బాలసుబ్రహ్మణ్యస్వామికి ఆదివారం తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో సందడి నెలకొంది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కొనసాగుతున్న లక్ష్మీ కుబేర హోమం



రామచంద్రాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రామాపురం బ్రహ్మర్షి పీఠంలో నిర్వహిస్తున్న లక్ష్మీ కుబేర హోమం ఆదివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు 108 యజ్ఞకుండాల్లో శాస్త్రోక్తంగా హోమాన్ని ప్రారంభించి 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. మహారాష్ట్రకు చెందిన జగద్గురు స్వామి శాంతి గిరిజనా ప్రభువు భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

- గ్రామస్థులతో కలిసి అభివృద్ధి





తరగతి గదిలో కొత్త బెంచ్‌లు, పాఠశాలకు మెరుగులు

రామచంద్రాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): అనుపల్లిలో తమ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి పూర్వవిద్యార్థులు, గ్రామస్థులు సంకల్పించారు. అంతే కాదు మరో గ్రామానికి తరలిపోకుండా చైతన్యంగా వ్యవహరించారు. ఈ క్రమంలోనే ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ఆర్థిక చేయూతనిచ్చి అన్ని హంగులనూ సమకూర్చారు. పంచాయతీ కేంద్రమైన అనుపల్లి పాఠశాలలో గత ఏడాది ఒక ఉపాధ్యాయుడు, రెండు తరగతి గదుల్లో 9మంది విద్యార్థులు ఉండేవారు. ప్రభుత్వం మోడల్ స్కూల్ ప్రకటనకు అర్హతలు లేక మరోచోటకు తరలిపోరాదని పూర్వవిద్యార్థులు భావించారు. వారంతా చేయి చేయి కలిపారు. గ్రామంలో మరి కొందరి నుంచి ఆర్థిక సాయం తీసుకుని పాతబడిన గదులకు పెయింటింగ్ వేయించారు. వైరింగ్, లైట్లు, ఫ్యాన్లు, కొత్త తలుపులు, పిల్లలకు బల్లలు సమకూర్చారు. బాత్‌రూమ్‌లను సిద్ధం చేశారు. పాఠశాల ప్రారంభానికి ముందు ప్రైవేటు పాఠశాలకు వెళుతున్న విద్యార్థులకు, వారితల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో ఈ ఏడాది 82మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. వీరి ప్రయత్నాలు ఫలించి అధికారులు కూడా ఐదుగురు ఉపాధ్యాయులను నియమించారు.

తిరుమల ఘాట్‌లో ఎలుగుబంటి



ఘాట్ సమీపానికి వచ్చిన ఎలుగుబంటి

తిరుమల, జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌లో ఆదివారం సాయంత్రం ఎలుగుబంటి కలకలం సృష్టించింది. రెండో మలుపు సమీపానికి ఎలుగుబంటి వచ్చింది. రోడ్డుపైకి వస్తుందేమో అని వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. కొన్ని నిమిషాల పాటు సమీపంలోనే తిరిగిన ఆ ఎలుగుబంటి తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది.

సీఎం పర్యటనలో నింగి నుంచీ నిఘా



సీఎం పర్యటనలో వాడిన డ్రోన్

తిరుపతి(నేరవిభాగం), జూలై 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం నాటి తిరుపతి పర్యటనలో పోలీసులు నింగి నుంచీ నిఘా పెట్టారు. తొలిసారిగా అత్యాధునిక టెథర్డ్ డ్రోన్ కెమెరాతో పాటు మరో 10 డ్రోన్‌లను వినియోగించారు. ఈ టెథర్డ్ డ్రోన్ కెమెరా ఐదు కిలోమీటర్ల పరిధి వరకు కవర్ చేస్తుంది. తూకివాకంలో రెండు, కపిలతీర్థంలో రెండు, పోలీసు పరేడ్ మైదానంలో మూడు చొప్పున డ్రోన్లు వాడారు. ఈ డ్రోన్ కెమెరాలకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కూడా ఉందని తిరుపతి సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ చెప్పారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియడంపై జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ హర్షవర్ధన రాజు ధన్యవాదాలు తెలిపారన్నారు.

వెటర్నరీ వర్సిటీకి ఈ ఏడాదీ 'బీ ప్లస్'నే



తిరుపతిరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి న్యాక్ బీప్లస్ గ్రేడ్ లభించింది. దేశంలోని వెటర్నరీ వర్సిటీలలో తొలిసారిగా గతేడాది ఎస్వీ వెటర్నరీ వర్సిటీ న్యాక్ గుర్తింపు పొందింది. ఈ ఏడాది కూడా బీప్లస్ గ్రేడ్ హోదాకే పరిమితమైంది. వర్సిటీలో ఈనెల 9వ తేది నుంచి మూడు రోజులపాటు హైబ్రిడ్ విధానంలో న్యాక్‌పీర్ టీమ్ సందర్శించింది. వర్సిటీలోని వివిధ డిపార్ట్‌మెంట్లు, లేబొరేటరీలు, పరిశోధనాస్థానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర వాటిని ఇద్దరు సభ్యులు నేరుగాను.. మరో ఇద్దరు న్యాక్ హెడ్‌కేంద్రం నుంచి ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు. కరిక్యులర్ యాస్‌పెక్ట్స్, టీచింగ్-లెర్నింగ్ అండ్ ఇవాల్యుయేషన్, రీసెర్చ్, ఇన్నోవేషన్స్ అండ్ ఎక్స్‌టెన్షన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లెర్నింగ్ రిసోర్సెస్, స్టూడెంట్ సపోర్ట్ అండ్ ప్రొగ్రెషన్, గవర్నెన్స్, లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూషనల్ వాల్యూస్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్ తదితర అంశాల గ్రేడింగ్ ప్రాతిపదికన బీప్లస్‌గ్రేడ్‌ని ఇచ్చారని సమాచారం.

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న జతిన్‌రెడ్డి

తిరుపతి(క్రీడలు), జూలై 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చదరంగం దినం పురస్కరించుకొని స్థానిక ఎస్వీ మెడికల్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన తిరుపతి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో తిరుపతికి చెందిన బాలబాలికలు ప్రతిభ చాటారు. 6నుంచి 60ఏళ్ల వయస్సు వరకు దాదాపు 300మంది క్రీడాకారులు ఈ పోటీలలో ప్రాతినిధ్యం వహించారు. తొలి మూడు స్థానాల్లో తిరుపతికి చెందిన జతిన్‌రెడ్డి (రూ. 4వేలు), త్రిపురాంబిక (రూ. 3వేలు), మిథున్ (రూ. 2వేలు) నగదు బహుమతి,ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.రవిప్రభు చేతులమీదుగా అందజేశారు. ఉదయం జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి టోర్నీని ప్రారంభించారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, టోర్నమెంట్ డైరెక్టర్ బాలాజీచౌదరి, శ్రీనివాసమూరి, వెంకట్‌అనిల్, సిసింద్రి, సునీత, వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇద్దరు మంత్రుల రాక

తిరుపతి(కలెక్టరేట్), జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సోమవారం రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్‌రెడ్డి రానున్నారు. ఉదయం 10గంటలకు తిరుపతిలో జరిగే స్థానిక కార్యక్రమాల్లో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొని.. అనంతరం గూడూరులో జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 8గంటలకు తిరుమల చేరుకుని మంగళవారం ఉదయం స్వామి వారిని, శ్రీకాళహస్తి స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమీక్షించి మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్లనున్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టులో రాజకీయ కక్షలు లేవు

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు విషయంలో ఎలాంటి రాజకీయ కక్షలు లేవని టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ స్పష్టం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో నగరపాలకసంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణతో కలిసి విలేకరుల ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి చంద్రబాబు హయాంలో ఎప్పుడూ రాజకీయ కక్షలకు పాల్పడలేదన్నారు. తాము రాజకీయ కక్షలకు దిగితే ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి జగన్ అరెస్టయ్యేవారన్నారు. గత ప్రభుత్వంలో ప్రజా ధనం లూటీ చేసిన వారిని తప్పక అరెస్టు చేస్తారన్నారు. మద్యం కేసులో మాజీ సీఎం నుంచి మంత్రుల వరకు జేబులు నింపుకొన్నారన్నారు. సిట్ అధికారుల దర్యాప్తులో నిజానిజాలు తేలుతాయన్నారు. గత ప్రభుత్వంలో తమ నాయకుడు చంద్రబాబు రాజకీయ కక్షలతోనే అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. వైసీపీ హయాంలో అన్ని స్థాయిల్లో టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. పీ4 పేద కుటుంబాలను దత్తత తీసుకున్న మార్గదర్శకులను సీఎం అభినందించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బుయాదవ్, శ్రీరాములు, రామారావు, జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై షణ్ముఖుడి విహారం

- విజ్ఞానగిరికి పోటెత్తిన భక్తజనం
- హరోం హర నామస్మరణతో మార్మోగిన పట్టణం
- నారద పుష్కరిణి వద్ద తలనీలాల సమర్పణ







ఇష్ట వాహనం నెమలిపై వళ్లీ, దేవసేన సమేత స్కందుడి వైభోగం - ఇంద్ర వాహనంపై స్వామిఅమ్మవార్ల పుర విహారం - నారద పుష్కరిణి వద్ద తలనీలాలు సమర్పించిన భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న కుమారస్వామి ఆడికృత్తిక వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తనకు ఇష్టమైన నెమలి వాహనంపై వళ్లీ, దేవసేన సమేతుడై కుమారస్వామి పురవిహారం చేశారు. మొదట స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ముక్కంటి ఆలయ అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం చప్పరంపై అధిష్ఠింపజేసి వాహన మండపానికి వేంచేపు చేశారు. అక్కడ నెమలి వాహనంపై అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాలు, మేళతాళాలతో స్వామిఅమ్మవార్లను పురవిహారా నికి తెచ్చారు. చతుర్మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లకు భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

హరోం.. హర

షణ్ముగ.. కార్తికేయా, చెంగల్వరాయ, వడివేలా.. మురుగా... తిరుత్తణివాసా, అప్పనే... హరోం.. హర నామస్మరణతో విజ్ఞానగిరి మారు మోగింది. ఆడికృత్తిక సందర్భంగా పసుపుపచ్చని దుస్తులు ధరించి కాలినడకన కావడి మోసే భక్తులు... నారద పుష్కరిణి వద్ద తలనీ లాలు సమర్పించే వారు... కుమారస్వామిని దర్శించు కోవడానికి క్యూలో భక్తులు బారులు తీరారు.

ప్రత్యేక మార్గాలు

ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా విజ్ఞానగిరిపై రద్దీ నియంత్రణకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండు వైపు ఉన్న మార్గం గుండా భక్తులను కొండపైకి అనుమతించారు. బాబుఅగ్రహారం వైపు నుంచి కిందకు దించారు. స్వామిఅమ్మవార్ల దర్శనం సందర్భంగా తొక్కిసలాట జరగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

తలనీలాల సమర్పణ

నారద పుష్కరణి వద్ద భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుష్కరణి వద్ద రద్దీ కొనసాగింది.

అధికారుల పర్యవేక్షణ

ఆడికృత్తికత ఉత్సవాల సందర్భంగా విజ్ఞానగిరిపై ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు వందమంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విజ్ఞానగిరిలోని క్యూలైన్ల వద్ద భక్తులకు సేవలందించారు.

ఇంద్ర విమానంపై పురవిహారం

సుబ్రహ్మణ్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఇంద్ర విమానంపై పురవిహారం చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ప్రసాదాల పంపిణీ

ఆడికృత్తికను పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలో పలువురు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పరీక్షల విభాగం ప్రక్షాళన

ఆంధ్రజ్యోతితో ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా ఆచార్య మాదాల భూపతి నాయుడు ఏడాది పాలనా కాలాన్ని పూర్తి చేసుకున్నారు. ఆయన యూనివర్సిటీ మౌలిక అంశాలపై దృష్టి సారించి, వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులను సమన్వయం చేసుకొని ప్రగతి సాధించడానికి తన వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌తో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ ఇలా..

అకడమిక్ షెడ్యూల్ ఎలా సాగింది?

జవాబు: 2024-25 అకడమిక్ ఇయర్‌ను ఏప్రిల్ 30 నాటికి పూర్తి చేశాం. ఈ అకడమిక్ ఇయర్‌లో సకాలంలో తరగతులు ప్రారంభించాం. యూనివర్సిటీ హాస్టళ్లలో బయటి వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నాం. ఈక్రమంలోనే 45 రోజుల పాటు హాస్టళ్లు మూసివేసి అవసరం వేరకు తిరిగి ప్రారంభించాం.

పరీక్షల విభాగం ప్రక్షాళన మాటేంటి?

జవాబు: గాడి తప్పిన పరీక్షల విభాగాన్ని సరిచేయడంపై దృష్టి పెట్టాం. ఉద్యోగుల బదిలీలతోనే సరిపెట్టుకోవడం లేదు. సకాలంలో పరీక్షలు, ఫలితాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆన్‌లైన్ ద్వారా వాల్యుయేషన్ చేపడుతున్నాం. డిగ్రీ పరీక్షా కేంద్రాలను 88 40కి తగ్గించాం. ఫలితంగా ఆర్థిక భారం తగ్గింది.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

క్యాంపస్ స్కూల్ పురోగతి చెబుతారా?

జవాబు: క్యాంపస్ స్కూల్ పేరుతో రూ.6.35 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. టీచింగ్ లోటును పూరిస్తూ, ఇద్దరు టీచర్ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నాం. పూర్వ విద్యార్థుల సహకారంతో డెస్క్‌లు, ఫర్నీచర్, ఆట వస్తువులు అందించాం. ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. స్కూల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను అనుసరిస్తున్నాం.

ప్లేస్‌మెంట్స్ ఎలా ఉన్నాయి..?

జవాబు: క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఎంఆర్‌ఎఫ్ టైర్స్‌లో ఇటీవల 26 మంది ఉద్యోగాల్లో చేరారు. సత్వా కంపెనీలో 90 మంది విద్యార్థులు చేరారు. యూఎస్‌ఏకి చెందిన ఎక్సాప్లయెన్స్ ద్వారా యూనివర్సిటీలోని పీజీ డేటా సైన్స్ విద్యార్థులు 7 మంది గూగుల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. వారికి గూగుల్‌లోనే ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తున్నాం. ఉపాధి అవకాశాలు పొందడానికి వీలుగా ఉన్న ఆధునిక కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

రుసా నిధులతో ఏం చేస్తున్నారు?

జవాబు: రూ. వంద కోట్లతో యూనివర్సిటీని అభివృద్ధి చేయడానికి సంకల్పించాం. రూ. 6 కోట్లతో ఉమెన్ హాస్టల్, రూ. 4 కోట్లతో మెన్ హాస్టల్ కొత్తగా నిర్మిస్తున్నాం. రూ. 4 కోట్లతో ప్రొఫెసర్లకు రీసెర్చ్ ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నాం. రూ. 7 కోట్లతో రీసెర్చ్ భవనం, రూ. 6 కోట్లతో అకడమిక్ బిల్డింగ్, రూ. 16 కోట్లతో ఇంజినీరింగ్ పనులు, రూ. 83 లక్షలతో ప్రహరీ, రూ.10 లక్షలతో డిజిటల్ స్టూడియో, ల్యాబ్ ఏర్పాటు చేయనున్నాం.

డ్రోన్ టెక్నాలజీ గురించి ప్రణాళిక ?

జవాబు: డ్రోన్ టెక్నాలజీకి సంబంధించి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నాం. రూ.5 కోట్ల కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో రాజీవ్ సమావేశ మందిరం పనులను పూర్తి చేసి డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తాం. కేంద్ర విమానయాన శాఖ అనుమతికి ప్రయత్నిస్తున్నాం. దీనిపై టీపీపీ సంస్థతో ఎంవోయూ చేసుకున్నాం.

బాధిత బైక్ మెకానిక్‌లకు ఆర్థిక సాయం



బాధిత మెకానిక్ కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు మునిరెడ్డి, తదితరులు

తిరుపతి(జీవకోన), జూలై 20(ఆంధ్రజ్యోతి): టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో మూడు కుటుంబాలకు రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. తిరుపతికి చెందిన గోపాల్, చంద్రగికి చెందిన చిన్నతంబి, తలకోనకు చెందిన సుబ్రహ్మణ్యం వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో రూ.10వేల వంతున అసోసియేషన్ తరపున సహాయం అందజేశారు. 70మంది మెకానికల్‌లకు స్పెషల్ టూల్‌కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి గురు ఆచారి, సంయుక్త కార్యదర్శి తేజరెడ్డి, కోశాధికారి బాబు, కమిటీ సభ్యులు నాగరాజు, పాపయ్య, మురుగయ్య, మెకానిక్‌ల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలపై ప్రశ్నించండి : వైసీపీ

తిరుపతి(జీవకోన), జూలై 20(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలపై ప్రశ్నించాలని వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జీవకోన పరిధిలో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానికులతో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆయన తెలిపారు. నాయకులు రెడ్డెప్ప, తలారి రాజేంద్ర, నవీన్, దుర్గ, ప్రసాద్, కోటి, దినేష్ పాల్గొన్నారు. అదే విధంగా నగర పరిధిలోని పలు డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

విద్యార్థులకు గౌడ ప్రతిభా పురస్కారాల ప్రదానం

తిరుపతి(విద్య), జూలై 20(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. జిల్లా గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శివశక్తి కళ్యాణమండపంలో ఈ కార్యక్రమం జరిగింది. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దిండుపాడు కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాజీ డీపీ అశోక్‌కుమార్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు చలపాటి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 100 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానంచేశారు. వెండి పతకాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం మాజీ అధ్యక్షులు యార్లపల్లి గోపిగౌడ్, గౌడ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మిశైలజ, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అరగొండ నరసింహులుగౌడ్, ఇతర నాయకులు మహిమలూరి శ్రీరాములు, మద్దిలేటి కృష్ణమూర్తి, కంభం లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు సంస్కారంపై శిక్షణ



మట్టి వినాయకుడిని తయారుచేస్తున్న పిల్లలు

తిరుపతి అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణమిషన్ ఆశ్రమంలో పిల్లలకు సంస్కారంపై ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మట్టితో వినాయకుడు, న్యూస్‌పేపర్లతో బ్యాగ్స్ తయారు చేయడం నేర్పించారు. పిల్లలు కూడా ఉత్సాహంతో నేర్చుకుంటూ చూడ చక్కటి ప్రతిమలను తయారుచేశారు. వాటిని మ ఇండ్లకు తీసుకెళ్లారు. మట్టి వినాయకుడి ప్రతిమలో వివిధ రకాల విత్తనాలు ఏర్పాటుచేశారు. యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. 4నుంచి 9వ తరగతి పిల్లలు 13మంది హాజరయ్యారు.

తిరుమలలో హిందువులు మాత్రమే ఉండాలి

తుమ్మా ఓంకార్

తిరుమల, జూలై20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కేవలం హిందువులు మాత్రమే ఉండేలా టీటీడీ బోర్డు తీర్మానం చేయాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు ఆదివారం ఓ ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. తిరుమల క్షేత్రానికి ఉగ్రవాదుల ముప్పు ఉందని పదేపదే కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరిస్తున్నప్పటికీ టీటీడీ తిరుమలలో అనుమానాస్పదంగా ఉన్న ఇతర మతస్థుల విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తోందన్నారు. తిరుమలలో ఓ పెట్రోల్ బంక్‌లో కూడా ఇద్దరు అన్యమతస్థులు అనుమానితంగా పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇతర మతస్థులు తిరుమలలో లేకుండా రానున్న సమావేశంలో టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకోవాలన్నారు.

త్వరలో మరో బీఎన్ఐ చాప్టర్ ప్రారంభం



దివాకర్‌రెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న బీఎన్ఐ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీఎన్ఐ తిరుపతి రీజన్ ఆధ్వర్యంలో బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్ నేషనల్ ఎస్సిల్వే 2.0 కార్యక్రమం మంగళంలోని ఆశా కన్వెన్షన్‌హాల్లో ఆదివారం జరిగింది. దేశవ్యాప్తంగా దాదాపు 1500బీఎన్ఐ, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఒకే వేదికలో వచ్చి కమీషన్ లేకుండా వ్యాపార లావాదేవీలపై పరస్పరం చర్చించి అభిప్రాయాలను పంచుకున్నారు. సామాన్యులకు అన్ని విధాల అందుబాటులో ఉండే అంశాలను సమన్వయం చేసుకున్నారు. తిరుపతిరీజన్‌లో త్వరలో 5వ బీఎన్ఐ చాప్టర్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసే శక్తి యువతకే సాధ్యమన్నారు. .ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించి జ్ఞాపికన బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ మేనేజ్‌మెంట్ కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.సంతోష్, మణి సందీప్, దుర్గాప్రసాద్, యుగంధర్, వంశీకృష్ణారెడ్డి, సాయికిరణ్ రెడ్డి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘ కార్యదర్శులుగా శ్రీనాథ్, పుష్పాంజలి



శ్రీనాథ్ - పుష్పాంజలి

తిరుపతి అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్స్ రాష్ట్ర కమిటీల్లో తిరుపతికి చెందిన ఇద్దరికి స్థానం లభించింది. కమిగీ రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.ఆదివారం విజయవాడలో రేషన్‌డీలర్స్ సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో రేషన్ డీలర్స్ రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్.శ్రీనాథ్(పురుషవిభాగం), బి.పుష్పాంజలి (మహిళావిభాగం)నియమితులయ్యారు. వీరిని రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌రెడ్డి, నగరాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

సీపీఐ నగర కార్యదర్శిగా విశ్వనాథ్



తిరుపతి (ఆటోనగర్), జూలై20 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నగర కార్యదర్శిగా రెండవ సారి విశ్వనాథ్ ఎన్నికయ్యారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి తెలిపారు. రెండు రోజులుగా పార్టీ నగర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. పార్టీ సహాయ కార్యదర్శిగా బండి చలపతితో పాటు 61 మందితో కార్యవర్గం ఏర్పడిందన్నారు. కౌన్సిల్ నుంచి 13 మంది కార్యవర్గ సభ్యులు ఎన్‌డీ రవి, శివ, కెపై రాజ, పద్మనాభ రెడ్డి, ఎండి. ప్రసాద్, ఆర్.బలరామ్, ఉదయ్‌కుమార్, మహేంద్ర, నాగరాజు, మంజుల, రత్నమ్మ మరో ఇద్దరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన వివరించారు. నగర అభివృద్ధికి టీటీడీ బడ్జెట్ నుంచి 10 శాతం నిధులు కేటాయించాలని, ఇళ్ళు లేని పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు భూమిని మంజూరు చేయాలని, గృహ నిర్మాణాలకు ఐదులక్షలు మంజూరు చేయాలని, రుయా, మెటర్నటీ ఆసుపత్రుల్లో ఖాళీలను భర్తీ చేయాలని. అత్యవసర సేవలకు భవనం నిర్మించాలని తీర్మానించామన్నారు.





అకట్టుకున్న నృత్యం - విడాకులు, ఆచమనం నాటకాల్లోని దృశ్యాలు

కలిసి ఉంటే కలదు సుఖం..!

● మంచి సందేశాన్నిచ్చిన 'విడాకులు కావాలి' నాటిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): కలసి ఉంటే కలదు సుఖం.. విడిపోతే చెడిపోతాం.. అనే సందేశాన్ని 'విడాకులు కావాలి' నాటిక అందించింది. అభినయ ఆర్ట్స్ - హనుమ అవార్డు రజతోత్సవంలో భాగంగా మహతి కళా క్షేత్రంలో ఆదివారం వివిధ నాటకాలను ప్రదర్శించారు. . తాడేపల్లెకు చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో వల్లూరు శివప్రసాద్ రాసిన, గంగోత్రిసాయి దర్శకత్వం వహించిన 'విడాకులు కావాలి' నాటికను ప్రదర్శించారు. గంగోత్రి సాయి, వసంతయామిని, రంగనాయకులు, స్వామి ఇందులో పాత్రలు పోషించారు. దాంపత్య జీవితంలో అభిప్రాయ బేధాలు, అపోహలు, చిన్న చిన్న సమస్యలు తలెత్తడం సహజమనీ, పరస్పరం సహకరించుకోవడం, మనసు విప్పి మాట్లాడుకోవడం వల్ల సర్దుబాటుతో సజావుగా సంసారం చేయొచ్చని నాటకం నిరూపించింది.

ఆలోచింపజేసిన 'ఆచమనం'

కాకినాడకు చెందిన ఎస్వీ రంగారావు కళా స్రవంతి ఆధ్వర్యంలో 'ఆచమనం' నాటికను ప్రదర్శించారు. కష్టంలో ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు మొదటగా భార్య, పిల్లలను గుర్తు చేసుకోవాలని ఈ నాటకం సూచిస్తుంది. దీని వల్ల ప్రేమకు చావు బెదిరి పోతుందని సారాంశంతో ఈ నాటక ప్రదర్శన సాగింది. ఇందులో ఇందులో వెంకన్న బాబు, కనుమసాయి, కృష్ణమరాజు, బాబ్జీ, రవికుమార్ పాత్రధారులుగా నటించారు. అంతకు ముందు వివిధ సంగీత, నృత్య ప్రదర్శనలు సాగాయి. కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ అధ్యక్షులు మబ్బు సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి బి. నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు ఏనుగు అంకమనాయుడు, రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి, దాతలు బాలాజీ, కృష్ణప్రసాద్, కళాకారులు కొత్తపల్లె మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాల్లో నేడు

సోమవారం ఉదయం 10 గంటలకు కూచిపూడి, భరతనాట్యం, జానపద బృంద నృత్య ప్రదర్శనలుంరు. సాయంత్రం 4 గంటలకు విష్ణువర్ధనుడు, 6 గంటలకు సారీ రాంగ్ నెంబర్ నాటికలను ప్రదర్శిస్తారు.

గోవిందధామం అధ్యక్షురాలిగా లక్ష్మి



తిరుపతి(జీవకోన), జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి-కరకంబాడీ రోడ్డులోని గోవిందధామం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జూలకంటి లక్ష్మి, కార్యదర్శిగా రామశేఖర్, కోశాధికారిగా హేమచందర్, వైస్ ప్రెసిడెంట్‌గా సోము, రవికుమార్, సహ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, సహ కోశాధికారిగా నామా రాజేష్, వ్యవస్థాపక అధ్యక్షులుగా టెంకాయల దామోదరం ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజేంద్ర శెట్టి హాజరయ్యారు. కెనరాబ్యాంకు సీఎస్ఆర్ ద్వారా రూ.1.20లక్షల విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేసింది కార్యక్రమంలో వేమూరి జయరాంప్రసాద్, మోహన్‌రెడ్డి, న్యాయ సలహాదారు మట్టా పురుషోత్తంరెడ్డి, ఆడిటర్ జగదీష్, ఎస్వీ యూనివర్శిటీ పూర్వపు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మురళి, ప్రొఫెసర్ చలపతి, ఆదం రాధాకృష్ణారెడ్డి, ఆదం సుధాకర్‌రెడ్డి, జక్క సుబ్బరాజు, ఎస్‌బీబీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీ డీఎస్పీగా వెంకటనారాయణ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్బీ డీఎస్పీగా వెంకటనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు సీఐలు, ఎస్ఐలు, ఎస్బీ సీఐ షాదిక్ ఆలీ ఆయన్ను కలసి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజును కలిశారు. జిల్లాలో పోలీసు వ్యవస్థ పనితీరు, పీజీఆర్ఎస్ నిర్వహణ, కొన్ని విషయాలపై చర్చించారు.

తిరుపతి-చర్లపల్లి మధ్య ఆగస్టులో ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) జూలై20(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అవసరాల మేరకు ఆగస్టులో ఎనిమిది ప్రత్యేక ఏసీ రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు.

ఆ రైళ్ల వివరాలు ఇవి

● తిరుపతిలో ప్రత్యేక రైలు(07481) ఆగస్టు 3న(ప్రతి ఆదివారం) బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూల్ సిటీ, గద్వాల్, వనపర్తి రోడ్డు, మహబూబ్ నగర్, జడ్చెర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడల మీదుగా చర్లపల్లికి సోమవారం చేరుకుంటుంది.

● చర్లపల్లిలో ప్రత్యేక రైలు(07482) 4న(ప్రతి సోమవారం) బయలుదేరి వచ్చిన మార్గంలోనే మరుసటి రోజు తిరుపతికి చేరేకొంటుంది. ఈ రైలు ఆగస్టు 25 వరకు రాకపోకలు సాగిస్తుంది. ప్రత్యేక రైలులో పూర్తిగా మూడవ శ్రేణి ఏసీ కోచ్‌లుంటాయి.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

తిరుపతి(ఆటోనగర్), జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారం మోపే విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి పిలుపు నిచ్చారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అదానీ కంపెనీ ప్రయోజనాల కోసం స్మార్ట్ మీటర్లను రాష్ట్ర ప్రభుత్వం గృహాలకు అమర్చడానికి చాప కింద నీరులా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో ఇళ్ళకు స్మార్ట్ మీటర్లు అమర్చడానికి వస్తే పగులగొట్టండని నారా లోకేష్ పిలుపు నిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన అనంతరం స్మార్ట్ మీటర్లపై ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లకు, పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వచ్చే నెల 4వ తేది వరకు జరుగుతున్న నిరసన ఆందోళనలు ఉధృతం చేయాలన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు. కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఎ.పుల్లయ్య, ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మీ, వేణుగోపాల్,శివకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి పవిత్రోత్సవాలు ప్రారంభం





స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు - ముత్యాల కిరీటాలు అందజేస్తున్న దాతలు

తిరుపతి అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 11గంటలకు సీతా రామ సమేత లక్ష్మణ స్వామి వారి ఉత్సవమూర్తులకు కన్నులపండువగా స్నపన తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. రాత్రి పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం, తదితర కైంకర్యాలను నిర్వహించారు. తిరుపతికి చెందిన పురుషోత్తం ఉత్సవమూర్తులకు నాలుగు ముత్యాల కిరీటాలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో నాగరత్న, ఏఈవో రవి, అర్చకస్వాములు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే కాంట్రాక్టు ఉద్యోగి మృతి



మృతి చెందిన రాజశేఖర బాబు

తిరుపతి (నేరవిభాగం), జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వే కాంట్రాక్టు ఉద్యోగి మృతి చెందాడు. రూరల్ సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన రాజశేఖర బాబు(44) ద్విచక్ర వాహనంలో తన ఇద్దరు కుమార్తెలను చంద్రగిరిలోని డ్యాన్స్ క్లాసులో వదలి పెట్టారు. అక్కడ నుంచి విధుల నిమిత్తం తిరుపతిలోని ఐఆర్‌సీటీసీ ఆఫీసుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని సి.మల్లవరం గ్రామంలోకి వెళ్లి అక్కడ నుంచి మళ్లీ చెర్లోపల్లె, చంద్రగిరి రోడ్డులోకి వచ్చారు. చెర్లోపల్లి వైపు వెళుతుండగా ఎదురు రూట్‌లో వేగంగా వచ్చిన పుంగనూరు ఆర్టీసీ డిపో బస్సు ఇతడి ద్విచక్ర వాహనదారున్ని ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌ను తిరుపతి రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని డాక్టర్లు నిర్ధారించారు. రాజశేఖర్‌బాబుకు భార్య ఉషారాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించి, తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్ షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తిరుపతి రైల్వే పోలీసులు అరెస్టు చేసిన దొంగ

ఫోన్ తీసుకుని.. నగదుకు ఎసరు

● నిందితుడి అరెస్టు.. రూ.87 వేల స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 20(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులను మాయమాటలతో బురిడీ కొట్టించి మొబైల్ ఫోన్ల ద్వారా నగదు కాజేస్తున్న దొంగను ఆదివారం రైల్వే ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. రైల్వే పోలీసు సీఐలు సందీప్‌కుమార్, ఆశీర్వాదం కథనం మేరకు.. ఒంగోలుకు చెందిన వేణుబాబు గతేడాది అక్టోబరులో తిరుపతి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ప్రయాణికుడిలా నటిస్తూ, పేపరు చూస్తున్నాడు. పక్కనున్న ప్రయాణికుడు సెల్‌ఫోను ద్వారా ఎవరికో నగదు పంపుతుండగా పాస్‌వర్డ్ చూశాడు. ఆ తర్వాత ఇంట్లో వాళ్లతో మాట్లాడాలంటూ అతడి నుంచి మొబైల్ ఫోన్ తీసుకుని పరారయ్యాడు. కొంతసేపటి తర్వాత యూపీఐ ద్వారా తన ఖాతాకు నగదు బదిలీ చేసుకున్నాడు. ఇదే తరహాలో వేణుబాబు ఆదివారం తిరుపతి రైల్వే స్టేషన్లో ప్రయత్నిస్తుండగా రైల్వే పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గతంలో ప్రయాణికుడి నుంచి కాజేసిన రూ.87వేలను స్వాధీనం చేసుకున్నారు. ఇతడు కొంత కాలంగా రైల్వే స్టేషన్లలో ఇలా మొబైల్ ఫోన్లు తీసుకుని నగదును బదిలీ చేసుకునే వాడు. ఇతడ్ని పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన రైల్వే ఎస్ఐలు ధర్మేంద్ర, రామకృష్ణ, పోలీసులను అధికారులు అభినందించారు.

గుడిపేరుతో క్షుద్రపూజలు

ఆక్రమణను ధ్వంసం చేసిన కొండూరు గ్రామస్తులు



స్థానికులకు సర్దిచెబుతున్న పోలీసులు

తడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుడిపేరుతో క్షుద్రపూజలు నిర్వహిస్తూ గ్రామానికి అరిష్టం చేస్తున్నారంటూ కొండూరు గ్రామస్తులు ఆలయ ఆవరణాన్ని ధ్వంసం చేశారు. మండల పరిధిలోని కొండూరు గ్రామం జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి చాముండేశ్వరి ఆలయం పేరుతో చిన్నపాటి తాత్కలిక గుడి నిర్మించారు. ఇందుకు గ్రామంలోని ఓ వర్గం మద్దతు తెలపగా మరోవర్గం వ్యతిరేకిస్తూ వచ్చింది. గుడిపేరుతో క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసు కువెళ్లారు. ఆదివారం గ్రామస్తులు మూకుమ్మడిగా ఆ గుడివద్దకు చేరుకొని తాత్కలికంగా వేసిన షెడ్‌లను ధ్వంసం చేశారు. అనంతరం జాతీయ రహ దారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. తమ గ్రామంలో క్షుద్రపూజలు నిర్వహిస్తుండటంతో కొంతమంది చనిపోయారని, ఆ గుడిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని, వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు నచ్చచెప్పడంతో గ్రామస్తులు అక్కడ నుంచి వెనుతిరిగారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడదాం

ఏఐటీయూసీ పిలుపు

గూడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడదామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో మున్సిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆగస్టు 7నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. ఈనెల 27న గూడూరులో జరగనున్న ఏఐటీయూసీ ప్లీనరి సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, నారాయణ, ఉదయ్‌కుమార్, చాముండేశ్వరి, సీపీఆర్ కుమార్, యాకోబు, గోపి, రాఘవులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

నడకతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నడకతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ సూచించారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి మునికృష్ణయ్య, డిస్ట్రిక్ట్ గవర్నర్ రావిళ్ల మాధవనాయుడు, మాజీ అధ్యక్షుడు రామచంద్రానాయుడు, మహమ్మద్ రఫీ, రఘునాథ రెడ్డి, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే భాను పరామర్శ



వడమాలపేట,జూలై 20 (ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటనలో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరా మర్శించారు. శనివారం రేణిగుంట విమానాశ్రయంలో తీవ్రంగా గాయ పడి న విషయం తెలిసిందే. అమర హాస్పిటల్‌లో ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ ప్ర మా దం దురదృష్టవశాత్తు జరిగిందని, టీడీపీ అండగా ఉంటుందన్నారు. తొందరలో కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని బాధితుడికి భరోసా ఇచ్చారు. పరిశీలించిన వారిలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, దేవనందం నాయుడు, వడమాల పేట మండల టీడీపీ అధ్యక్షులు దాముయాదవ్, కార్యదర్శి శివరాయల్ తదితరులు ఉన్నారు.

వేడుకగా ఆడికృత్తిక



పుత్తూరు టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక పురస్కరించుకుని పుత్తూరు పట్టణంలోని వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, గొల్లపల్లి సమీపంలోని మలేసియా మురగన్ ఆలయాలకు భక్తులు కావళ్లతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల హరోంహర నామస్మరణలో పట్టణం మార్మోగింది.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

పుత్తూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే అజెండాగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కృషి చేస్తున్నారని పుత్తూరు పట్టణ పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు దిలీప్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో జరగని అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో ఎమ్మెల్యే చేసి చూపించారని కొనియాడారు. ప్రజా ధనాన్ని, ప్రకృతి సంపదను కొల్లగొట్టే పార్టీగా వైసీపీని ప్రజలు గుర్తుంచుకుంటారని చెప్పారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని దేవుడు కూడా క్షమించరన్నారు. నోరు పారేసుకుంటేనే గుర్తింపు లభిస్తుందని భావించిన మాజీ మంత్రికి గత ఎన్నికల్లో 45 వేల ఓట్ల మెజారిటీ దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా హుందాగా రాజకీయం చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పార్తిబన్,ముని, వాణి, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసన



నిరసన కార్యక్రమంలో రోజా తదితరులు

పుత్తూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఆదివారం మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ కల్యాణి ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ వైసీపీ నాయకులు నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు జరుగుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం/కేవీబీపురం: అక్రమ అరెస్టులతో ప్రజాభిమానాన్ని ఆపలేరంటూ ఉమ్మడి జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ధనంజయులురెడ్డి పేర్కొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు

పెళ్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లి దళితవాడలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. దళితవాడకు చెందిన బాలకృష్ణపై అదే గ్రామానికి చెందిన లోకేష్, చలపతి, రమణమ్మ తదితరులు దాడికి పాల్పడి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు

యువకుడి ఆత్మహత్య



నాయుడుపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో ఆలయం వెనుక చెట్టుకు ఉరివేసుకొని గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం చెట్టుకు ఉరివేసుకున్న వ్యక్తిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృత దేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





తొణుకుమాల సమీపంలో నిర్మిస్తున్న సాగరమాల రోడ్డు - అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు (ఫైల్‌ఫొటో)

అండర్‌పాస్ నిర్మించకపోతే అవస్థలే!

చిల్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొణుకుమాల, ఉడతావారిపార్లపల్లి, తిక్కవరం గ్రామాలకు సమీపంలోని సాగరమాల రహదారిపై అండర్‌పాస్ నిర్మించకపోతే రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని తొణుకుమాల, తిక్కవరం, ఉడతావారిపార్లపల్లి గ్రామాల సమీపంలో సాగరమాల రహదారి పనులు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అండర్‌పాస్ నిర్మించడం లేదని, దీంతో తమకు దీర్ఘకాలిక అవస్థలు తప్పవని అంటున్నారు. ప్రధానంగా తొణుకుమాల, ఉడతావారిపార్లపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు తిక్కవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లిరావాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. అండర్‌పాస్ లేకపోతే సుమారు మూడు కిలోమీటర్లు వరకు చుట్టుతిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంటుందని, విద్యార్థులతో పాటు పలు పనుల నిమిత్తం తిక్కవరం గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అదేవిధంగా యోగేశ్వరపల్లిలోని కొంత మంది రైతులకు తొణుమాల సమీపంలోని పొలాలు ఉండడంతో వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుందని అంటున్నారు. అండర్‌పాస్ నిర్మించాలని ఇటీవల ఆయా గ్రామాల ప్రజలు రోడ్డుపై ఆందోళన చేపట్టి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు స్పందించి అండర్‌పాస్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సర్టిఫికెట్లపై ప్రభుత్వ చిహ్నాలే ఉంటాయ్: మంత్రి సంధ్యారాణి



సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

నాయుడుపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు జారీచేసే సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు, భూములు పాస్ పుస్తకాలపై రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాలే ఉంటాయని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం నాయుడుపేట ఏఎంసీ గోదాము ప్రాంగణంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతే తరతరాలుగా, వంశపారపర్యంగా వస్తున్న భూముల పాస్ పుస్తకాలతో పాటు అన్ని సర్టిఫికెట్లపై గత వైసీపీ ప్రభుత్వం దిష్టిబొమ్మల్లా ఫొటోలు ముద్రించిందని విమర్శించారు. అవినీతి, అరాచక పాలనను భరించలేక ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా కేవలం 11 సీట్లకే పరి మితం చేశారన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో కుటుంబంలో ఒక్క బిడ్డకే సంక్షేమం అందజేస్తే, ఎన్డీఏ ప్రభుత్వంలో తల్లికి వందనంతో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా ఒక్కొక్కరికి రూ.13వేల చొప్పున అందజేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించి కేవలం రూ.5కే మూడు పూట్లా సంతృప్తికరమైన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం జరుగు తుందన్నారు. టీటీడీ బోర్డు సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అరవపెరిమిడి చంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్, ఆకుతోట రమేష్, మండల అధ్యక్షుడు సంచి కృష్ణ య్య, విజయమోహన్ నాయుడు, వేమసాని శ్రీనివాసులు నాయుడు, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, మధుసూదనరెడ్డి, షైలారి రాజశేఖర్, దార్ల రాజేంద్ర, పొట్లపూడి రాజేష్, మొండెం బాబు, మాజీ ఎంపీపీ కన్నెమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త రాజ్యాంగం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మాజీ ఎంపీ నెలవల, రచయిత పేర్నాటి తదితరులు

నాయుడుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 'స్వతంత్ర భారతదేశం-రాజ్యాంగ నిర్మాణం' పేరిట న్యాయవాది పేర్నాటి వెంకటేశ్వర్లు రచించిన సంక్షిప్త రాజ్యాంగం పుస్తకాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఆదివారం నాయుడుపేటలోని ఎంకే కన్వెన్షన్ హాలులో పుస్తకావిష్కరణలో నెలవల మాట్లాడుతూ 395 ఆర్టికల్స్‌తో 1500 పేజీలున్న రాజ్యాంగాన్ని 142పేజీలతో సంక్షిప్తంగా రచించిన పేర్నాటి వెంకటేశ్వర్లును అభినందించారు. రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా అభ్యసించి అందరికీ అర్థమయ్యేరీతిలో రచించిన ఈ పుస్తకం భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఎంఈవో మునిరత్నం, రామచంద్రారెడ్డి, మాజీ ఎంఈవో శ్రీనివాసులు, బందిల మోహన్, ట్రినేటి సూపర్ స్పెషాలిటీ సీఈవో నాగూరయ్య, రామకృష్ణ, సుధాకర్, న్యాయవాది చదలవాడ కుమార్, సీవీరామన్ డైరెక్టర్ గోపీ, నవోదయ పద్మనాభరెడ్డి, శ్రీవేమ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనను వివరించండి: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎల్ఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 80శాతం అమలు చేసిందన్నారు. ఏడాదిలో ఎంతో అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ఇవన్నీ ప్రజలకు వివరించాలన్నారు. చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోడం వల్లే 2019లో ఓడిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ పరిస్థితి పునరావృతంగా కాకుండా ఉండాలంటే పార్టీలో అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కష్టపడి పనిచేస్తే పార్టీలో గుర్తింపు ఉంటుందని, వైసీపీ చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నిలను దృష్టిలో ఉంచుకొని సమర్థవంతమైన వ్యక్తులతో కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జన్ని రమణయ్య చెప్పారు. అందరూ సమష్టిగా కృషిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు అన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు బొమ్మిని పళని, నారాయణరెడ్డి, మాధవరావు, బాబు నాయుడు, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, సైదాపురం మండలాల అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రావి మస్తాన్ నాయుడు, దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో మంత్రి సంధ్యారాణి



మంత్రి సంధ్యారాణికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న సహాయ కమిషన్ ప్రసన్న లక్ష్మి, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల తదితరులు

సూళ్లూరుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరిని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం దర్శించుకున్నారు. మంత్రికి ఆలయం వద్ద ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల మంజూరు చేయండి

పెళ్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలానికి గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణికి టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలో గురుకుల పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అత్యధికంగా ఉన్న పెళ్లకూరు మండలానికి గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని కోరారు.

వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే కేసులు పెట్టకుండా ఊరుకోవాలా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో పోలీసులకు అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులను వేధిస్తూ అక్రమలు కేసులు పెట్టారన్నారు. తాము అధికారంలో ఉన్నా ఈ తరహా చర్యలకు పాల్పడలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం సిలికా, క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌ను యధేచ్ఛగా కొనసాగించారన్నారు. తాను నిత్యం ప్రజల్లోనే ఉంటానని, దీనిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, జహంగీర్, సిద్దయ్యనాయుడు, రవీంద్రరెడ్డి, ఇశ్రాయిల్ కుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.





నాయుడుపేటలో వేలాయుధాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు - తడలో కావడితో వెళ్తున్న భక్తులు

వైభవంగా ఆడికృత్తిక వేడుకలు





చిట్టమూరు: గ్రామోత్సవంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి - కోట: విశేష అలంకారంలో బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

చిట్టమూరు, జులై 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాంలో వెలసిన స్వయంభు వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ చెర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, గణపతి హోమం, స్వయంభు మూర్తికి పాలాభిషేకం, అష్టోత్తర కలిశాభిషేకం, అమృతాభిషేకం నిర్వహించారు. నూరు స్తంభాల కల్యాణ మండపంలో జరిగిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకాల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అదేవిధంగా అరవపాళెం సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక వేడుకలు జరిగాయి.

కోట: పట్టణ పరిధిలోని కొక్కుపాడు సమీపంలో ఉన్న బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు కావిడిలు ఎత్తుకొని హరోహర నామాలతో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేశారు. కోట పట్టణానికి చెందిన సారంగం సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నుంచి భక్తులు 108 వేలాయుధాలతో పట్టణ పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు.

తడ: మండల పరిధిలోని చిన్నమాంబట్టులో ఉన్నకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు నిర్వహించారు. తిరుపతి సిమ్స్ వైద్యుడు కారణి మునస్వామి ఆధ్వర్యంలో భక్తులు కావళ్లను మోసుకుంటూ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గోపూజ జరిగింది.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్ సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో వెంకటనారాయణ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, సుమన్ రెడ్డి, రాధయ్య, శ్రీనివాసాచారి, అరుణ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

తడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయా లయ్యాయి. స్థానిక బోడిలింగాల పాడుకు చెందిన అయ్యంగోళం ధనుష్ ఆదివారం జాతీయ రహదారి వద్దకు వచ్చాడు. తిరిగివెళ్తూ రోడ్డు దాటు తుండగా చెన్నై వైపు వెళ్తున్న ఓ కారు అతనిని ఢీకొంది. గాయపడిన ధనుష్‌ను స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసు లకు ఫిర్యాదు అందలేదు.

కారును ఢీకొన్న బస్సు

నాయుడుపేట టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ జాతీయ రహదారి కూడలి వద్ద కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆదివారం చెన్నై నుంచి వరంగల్ వెళ్తున్న కారును మల్లాం జంక్షన్ మలుపు వద్ద బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది. ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శాకాంబరి అలంకారంలో కన్యకా పరమేశ్వరి

కోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోటలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరిని ఆదివారం వేదపండితులు శాకాంబరిగా అలంకరించారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 51 రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్త జన సంద్రం... ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్త జన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులతో పాటూ ఆడికృత్తిక తోడవడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 739 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,602, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,663 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,899మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,215, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 361మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 305మంది, రూ.5 వేలు టిక్కెట్ల ద్వారా 119మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 32,739 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యం



ఏర్పేడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని రావిళ్లవారి కండ్రిగలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో బాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, నాయకులు గురవారెడ్డి, పొన్నారావు, సూరినాయుడు, బాబునాయుడు, బత్తల గిరినాయుడు, రవినాయుడు, సుబ్రహ్మణ్యం, చంద్రారెడ్డి, కృష్ణప్ప మొదలియార్, సీతాపతిఆచారి, గణేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన కాంపాళెం వీధులు





బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం దళితవాడలో వర్షానికి వీధులు చిత్తడిగా మారాయి. వారం రోజులు నుంచి రోజు వర్షాలు కురుస్తుండటంతో దళితవాడ వీధుల్లో నీరు నిలిచిపోవడంతో నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దళితవాడలోని తూర్పు వీధి, దక్షిణ వీధులకు వేసిన సిమెంట్ రోడ్లు లోతట్టుగా ఉండటం వలన వర్షం వస్తే నీరు వెళ్లే మార్గం లేక నిల్వ చేరి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తూర్పు వీధిలో చాలా సంవత్సరాలు క్రితం నిర్మించిన సిమెంట్ రోడ్డు మరమ్మతులకు గురవడంతో రాకపోకలకు మారడంతో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

చెరువుకు మరమ్మతులు చేపట్టండి



వృథాగా పోతున్న నీరు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ అనంతపురం చెరువు కలుజు, తూముకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ చెరువు కింద 150 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుకు సంబంధించిన తూము దగ్గర ఐదు సంవత్సరాల క్రితం బొగడ పడటంతో నీరు వృథాగా పోవడంతో పంటలకు నీరు అందడం లేదు. బొగడ దగ్గర రైతులు కలసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికి ఫలితం ఇవ్వడం లేదు. అదే విధంగా కలుజు దగ్గర ఉన్న రాళ్లు కూలి పోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం చెరువు నిర్వహణ పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కలుజు, తూములకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

ఘనంగా చెస్‌డే



ఏర్పేడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో శ్రీసాయి బ్రిలియంట్స్ హైస్కూల్‌లో ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 80మంది పాల్గొన్నారు. చెస్ కోచ్ రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీ తేజ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. బాలికల సీనియర్ విభాగంలో చందన, హర్షిత, ప్రియ, నిఖిత, జూనియర్ విభాగంలో జాహ్నవి, నిక్షిత గెలుపొందారు. బాలుర సీనియర్ విభాగంలో లోచన్ తేజ్, యతీష్, బాలుర జూనియర్ విభాగంలో సంతోష్, మోహిత్ నందన్ విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల యాజమాన్యం, హెచ్‌ఎం చంద్రశేఖర్ బహుమతులను ప్రదానం చేశారు.

12వ వేతన అమలుకు కమిషనర్‌ను నియమించాలి: ఏపీటీఎఫ్

శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): 12వ వేతన సవరణ అమలకు కమిషనర్‌ను నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధక్షుడు మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 నుంచి ఉద్యోగులకు వేతన సవరణ, మధ్యంతర భృతి చెల్లించాల్సి ఉందన్నారు. సీపీఎస్ రద్దు చేసి 2003కు ముందు నియామకం పొందిన వారికి కేంద్రప్రభుత్వం విడుదల చేసిన మెమో నెం.57ను అమలు చేసి పాత పింఛన్ అమలు చేయాలన్నారు. బాలసుబ్రహ్మణ్యం, వెంకటాద్రి, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం పొందండి

కేవీబీపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్ మేస్త్రీలు, బేల్‌దార్లు, కూలీలు తప్పనిసరిగా యూనియన్ సభ్యత్వం తీసుకుని లేబర్‌కార్డులు పొందాలని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. ఆదివారం కేవీబీపురంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో ప్రమాదంలో గాయపడ్డా, మరణించినా ప్రభుత్వం బీమా అందిస్తుందని చెప్పారు. వెంకటరత్నం, హరి, చిన్నప్పయ్య, ఫల్గుణ, మురళి, శ్రీను, గిరి, కృష్ణమూర్తి, వెంకటరత్నం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బొప్పన మోహన్‌బాబుకు సత్కారం

వరదయ్యపాళెం, జూలై 20(ఆంధ్రజ్యోతి): దేవ బ్రాహ్మణ(దేవాంగ) అర్చక, పండిత, పురోహిత పరిషత్‌లో కార్యవర్గ సభ్యుడిగా పౌరోహిత రంగంలో విశేష కృషి చేస్తున్న గోవర్ధనపురానికి చెందిన బొప్పన మోహన్‌బాబుకు చీరాలలో ఆదివారం ఘన సత్కారం జరిగింది. గుత్తి త్యాగరాజు, మహర్షి ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ సీవి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై షణ్ముఖుడి విహారం

విజ్ఞానగిరికి పోటెత్తిన భక్తజనం ● హరోం హర నామస్మరణతో మార్మోగిన పట్టణం ● నారద పుష్కరిణి వద్ద తలనీలాల సమర్పణ







ఇష్ట వాహనం నెమలిపై వళ్లీ, దేవసేన సమేత స్కందుడి వైభోగం - ఇంద్ర వాహనంపై స్వామిఅమ్మవార్ల పుర విహారం - నారద పుష్కరిణి వద్ద తలనీలాలు సమర్పించిన భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న కుమారస్వామి ఆడికృత్తిక వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తనకు ఇష్టమైన నెమలి వాహనంపై వళ్లీ, దేవసేన సమేతుడై కుమారస్వామి పురవిహారం చేశారు. మొదట స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ముక్కంటి ఆలయ అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం చప్పరంపై అధిష్ఠింపజేసి వాహన మండపానికి వేంచేపు చేశారు. అక్కడ నెమలి వాహనంపై అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాలు, మేళతాళాలతో స్వామిఅమ్మవార్లను పురవిహారానికి తెచ్చారు. చతుర్మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లకు భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

హరోం.. హర

షణ్ముగ.. కార్తికేయా, చెంగల్వరాయ, వడివేలా.. మురుగా... తిరుత్తణివాసా, అప్పనే... హరోం.. హర నామస్మరణతో విజ్ఞానగిరి మారుమోగింది. ఆడికృత్తిక సందర్భంగా పసుపుపచ్చని దుస్తులు ధరించి కాలినడకన కావడి మోసే భక్తులు... నారద పుష్కరిణి వద్ద తలనీ లాలు సమర్పించే వారు... కుమారస్వామిని దర్శించుకోవడానికి క్యూలో భక్తులు బారులు తీరారు.

ప్రత్యేక మార్గాలు

ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా విజ్ఞానగిరిపై రద్దీ నియంత్రణకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండు వైపు ఉన్న మార్గం గుండా భక్తులను కొండపైకి అనుమతించారు. బాబుఅగ్రహారం వైపు నుంచి కిందకు దించారు. స్వామిఅమ్మవార్ల దర్శనం సందర్భంగా తొక్కిసలాట జరగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రసాదాల పంపిణీ

ఆడికృత్తికను పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలో పలువురు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు యేటా ప్రసాదాలు పంపిణీ చేస్తుంటారు.

తలనీలాల సమర్పణ

నారద పుష్కరణి వద్ద భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుష్కరణి వద్ద రద్దీ కొనసాగింది.

అధికారుల పర్యవేక్షణ

ఆడికృత్తికత ఉత్సవాల సందర్భంగా విజ్ఞానగిరిపై ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు వందమంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విజ్ఞానగిరిలోని క్యూలైన్ల వద్ద భక్తులకు సేవలందించారు.

ఇంద్ర విమానంపై పురవిహారం

సుబ్రహ్మణ్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఇంద్రవిమానంపై పురవిహారం చేశారు. చతుర్మాడ వీధుల్లో విహరిస్తున్న స్వామిఅమ్మవార్లకు భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

● తొట్టంబేడు మండలం చెన్నై రోడ్డులో కొలువై సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంచినీళ్ల గుంట సమీపంలో ఉన్న కరుమారియమ్మ ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి ఉప ఆలయంలో వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.









కావళ్లతో విజ్ఞానగిరికి వెళ్తున్న చిన్నారులు - ఏర్పాట్ల పరిశీలనలో ముక్కంటి ఆలయ ఈవో - తొట్టంబేడు, రేణిగుంటల్లో జరిగిన ఆడికృత్తిక ప్రత్యేక పూజలు

కక్షలు, కార్పణ్యాలకు మారు పేరు వైసీపీ

యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

పిచ్చాటూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతంలో పరిపాలన చేసిన వైసీపీ ప్రభుత్వం కక్షలు, కార్పణ్యాలకు మారుపేరుగా నిలిచిందని, తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని యాదవ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ చెప్పారు. మండలంలోని కీళపూడిలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. అడ్డగోలు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలనుకుంటే 2029 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి సింగిల్ డిజిట్ రావడం ఖాయమన్నారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలిస్తున్న కూటమి ప్రభుత్వం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. సిట్ దర్యాప్తు మేరకు లిక్కర్ స్కాంలో బడా బాబులను అరెస్టు చేస్తుంటే కక్షసాధింపులంటూ అడ్డగోలు ఆరోపణలు చేస్తున్న వైసీపీ నాయకులకు ప్రజలు రాష్ట్రంనుంచి తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టు సైతం వారికి బెయిల్ అంగీకరించలేదంటే వాళ్ల ఎంతటి కరుడు కట్టిన నేరగాళ్లో అర్థమవుతోందన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం దోపిడీలు గురించి ప్రజలందరికీ ఎరుకేనన్నారు. దీన్ని మసిపూసి మారేడుకాయ చేయాలనుకుంటే అంతటి అవివేకులు ఎవరు లేరన్నారు. టీడీపీ పుట్టినప్పటి నుంచి ఏనాడూ విష సంస్కృతికి బీజం వేసిన దాఖలాలు లేవన్నారు. నీతికి నిజాయితీకి టీడీపీ పెట్టింది పేరన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభరాజు, రాష్ట్ర బీసీ విభాగ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీల కలకలం

నాగలాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహావీర్ బంగారు నగల దుకాణంలో చోరీ జరిగినట్టు యజమాని జల్రాజ్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు దుకాణ షట్టర్ల తాళాలను గడ్డపారతో ధ్వంసం చేయడానికి యత్నించారన్నారు. అంతకుముందు శనివారం మధ్యాహ్నం ఇద్దరు మహిళలు తన దుకాణంలో 12 గ్రాముల రెండు బంగారు గొలుసులను చోరీ చేశారన్నారు. వెండి కాళ్ల పట్టీలను కావాలని వారు కోరగా, తాను వాటిని తీస్తున్న సమయంలో గోడకు ఉంచిన బంగారు గొలుసులను తీసి లోదుస్తుల్లో పెట్టుకున్నారన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా చోరీ జరిగిన విషయాన్ని గుర్తించానన్నారు. సీసీ టీవీ ఫుటేజీలను జత చేసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సునీల్ తెలిపారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంబేడులో ఉన్న రామలింగేశ్వరస్వామి, నాగాలమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయాల్లో ప్రవేశించి రూ.1.5 లక్షల విలువైన సొత్తును చోరీ చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రవేశించిన దుండగులు మూడు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. గుడి బయట ఉన్న హుండీని ధ్వంసం చేసి అందులో నగదును చోరీ చేశారు. అనంతరం ఆలయ గేటు బీగాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాను తెరచి అందులో దాచి ఉంచిన కిలో 250 గ్రాముల వెండి దీపాలు, హారతి తట్ట తస్కరించారు. నాగాలమ్మ ఆలయంలో హుండీ పగులగొట్టి అందులోని నగదు, అమ్మవారి మెడలోని బంగారు బొట్టును అపహరించారు. ఆదివారం ఉదయం ఆలయాల్లో దీపం పెట్టడానికి వచ్చిన పూజారులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి గ్రామపెద్దలకు సమాచారం చేరవేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోండి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని శ్రీకాళహస్తి 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి సూచించారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం విద్యార్థుల ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో వాటిని చేరుకోవాలన్నారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి శుభాకాంక్షలు



మధుబాల, పద్మరాజు దంపతులకు సన్మానం

పిచ్చాటూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మాజీ ఎంపీపీ మధుబాల, పద్మనాభరాజు పెళ్లి రోజు సందర్భంగా టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కీళపూడిలోని వారి స్వగృహానికి వెళ్లి ఆ దంపతులను శాలువతో సన్మానించి గజమాలతో సత్కరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, నాయకులు తిరుమలరెడ్డి, మునస్వామి యాదవ్, బాల రాజు, రామకృష్ణంరాజు, గిరిబాబు, శ్రీనివాసులు యాదవ్, బాలాజీరెడ్డి, యాచేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.